# గొలుసు కథ - ౯ థ్రీవే ప్రణాళిక

కారు మట్టిరోడ్డు దాటి హైవేమీద పరుగులు తీస్తోంది. రామకృష్ణ సిగరెట్టు నోట్లో పెట్టుకున్నాడు. వెంటనే భాస్కర్ సిగార్ లైటర్‌తో ముట్టించాడు. థాంక్స్ చెప్పి, గుండెలనిండుగా పొగపీల్చి, రోడ్డు మీద నుంచి దృష్టి మరల్చకుండానే రామకృష్ణ ప్రారంభించాడు.


"పూజా విధానం, మంత్రాల గొప్పతనాన్ని మీకు వివరించడంకోసం, వాడి తెలివితేటలుపయోగించి, దొంగవేషం వేసి, రామనామ సంకీర్తనంలో, వాడి వీపు మీద సంకీర్తన పాడించుకున్నాడు శర్మ!..."

అంతలో భాస్కర్ అందుకున్నాడు. "అఘోరించాడులే! వాడి తెలివితేటలూ-వాడూనూ! కార్యక్రమం చెల్లా చెదరైపోయింది! ఈ మాత్రం దానికి నోటితో చెబితే అర్థం చేసుకోలేమా? దొంగవేషం వెయ్యడం-దెబ్బలు తినడం-నాటెవైజ్ థింకింగ్!"

"అల్లా దొంగవేషం వేసి, అంత రభస వెయ్యకపోతే, థ్రిల్లు వచ్చేదీ కాదు! మీదిల్లుకి అర్థమయ్యేదీ కాదు!" శర్మ సమర్థించాడు.

"సరే! వాడికీ తెలివితేటలున్నాయని మనకమీషనర్ గారు ఒప్పుకున్నారు కదా! నువ్వు ఆ దెయ్యం సంగతి చెప్పు!" వెంకోజీ అన్నాడు.

'నా తెలివితేటలు గురించి చెప్పి, మీరు కూడా తెలివితేటలతో మెలగమని సలహా ఇచ్చినందుకు, నా మీద కక్షగాబోలు వీళ్ళకు!' భాస్కర్ మనసులో అనుకున్నాడు.



"అదే! ఆ రభస జరిగిన సాయంత్రం నేను, పాలేరుతో పొలం వెళ్ళాను సరదాకి. అక్కడ కొందరు కుర్రాళ్ళు గాలిపటాలెగురవేస్తూ, పోటీలు పడుతున్నారు. ఒకడి గాలిపటం తెగింది. గాలిలో తేలిపోతూ వెళ్ళి, మర్రిచెట్టు కొమ్మల్లో చిక్కుకుపోయింది. గాలికి గిరికీలు కొట్టి, దారం బాగా కొమ్మకు చుట్టుకుపోయింది. దానిమీద ఆశలు వదలుకున్నాడా కుర్రాడు.

"పాలేరు పచ్చిగడ్డికోసి, మోపుకట్టే సరికి పొద్దు వాలింది. ఆ సంధ్య చీకట్లో, మర్రిచెట్టుకేసి చూస్తే ఆ చిక్కుపడ్డ గాలిపటం, గాలివాటంతో చెయ్యెత్తి పిలుస్తున్న ఫీలింగ్ వచ్చింది. ఇది కరెక్టో కాదో తెలుసుకోవాలని, ఆ రాత్రి బాగా చీకటిపడ్డాక, దెయ్యాల గురించి చెప్పి, పాలేరును తీసుకెళ్ళి చూపాను! వాడు అదే భ్రమలో పడి, మర్నాడుదయం, వూరంతా చాటింపు వేశాడు. అది విని కుర్రాళ్ళు మనదగ్గరకు వచ్చారు. ఆ తర్వాత... " రామకృష్ణ అంటూండగా భాస్కరం అందుకున్నాడు.

"చాల్లే నోర్ముయ్! నీ తెలివితేటలవల్ల ఒక నిండు ప్రాణం పోవలసింది! ఏదో అదృష్టం బావుండి బతికి బయటపడ్డాడు."

"నువ్వేమన్నా అను! ఆ చెట్టువల్ల మనం చచ్చే వాళ్ళం! మనలాగే ఎందరికో అపాయకరం! జనం యాక్సిడెంటులో చచ్చాకైనా, దానికి ఆ పేరు తప్పదు! అందుకే పట్టుపట్టి మన తెలివితేటలుపయోగించి, నిమిషాలమీద ఆ చెట్టు కొట్టించి, పుణ్యం సంపాయించుకున్నాను. ఇకమీదట ఆ వూరి వాళ్ళుగానీ, ఆ రోడ్డున వెళ్ళేవాళ్ళుగానీ, సర్వేజనా సుఖినోభవంతు!" అన్నాడు గర్వంగా.

"మొత్తానికి భాస్కర్ సస్పెక్టు చేసినట్టు ఇది నీ బ్రెయిన్ వర్కే నన్నమాట!" శర్మ సంతోషంగా అన్నాడు.

"సరే సరే! సంతోషించాంగానీ, ఆ పెట్రోల్ బంకుకి పోనీ! కారుకి పెట్రోలు పొయ్యాలి" భాస్కర్ అన్నాడు.

కారు పెట్రోల్ బంకులో ఆగింది. పెట్రోలు పోయించి, భాస్కర్ డబ్బులిచ్చాడు.

"మరి మనకేరా?......పెట్రోలు!" వెంకోజీ అడిగాడు.

ఏం మాట్లాడకండి, హైదరాబాద్ చేరేదాకా! పదండి ముందు!" గదిమాడు.

అంతా వెళ్ళి కారులో కూర్చున్నారు.

ఇంతలో ఓ పెద్ద ప్లిమత్ కారు వచ్చింది.

"నమస్కారం సార్! కమీషనర్‌గారూ!" అంటూ ఒక సిల్కులాల్చీ శాల్తీ కారుదిగి, పరుగు పరుగున వచ్చాడు.

"అరెరె! సుబ్బారావుగారా! రండి రండి!" అంటూ భాస్కర్ దిగి, కరచాలనం చేశాడు.

ఏమిటి? మఫ్టీలో బయల్దేరారు?" అడిగాడు.

భాస్కర్ సమాధానం చెప్పి, ఆయనతో కొంచెం సేపు సంభాషించి తరువాత మిత్రులను పరిచయం చేశాడు.

బిజినెస్ మాగ్నెట్‌రా! వీరి అబ్బాయినే ఒకసారి దొంగలెత్తుకుపోయి, ఈయన్ని బ్లాక్‌మైల్ చేస్తే, నేను విడిపించాను!"

ఆ మాటలకు ఆయన సంతోషం వ్యక్త పరిచాడు.


"సార్! మాకు 'మేడ్చల్' దగ్గర గుట్టమీద పాతిక ఎకరాల ద్రాక్ష ఎస్టేట్ వుంది. మంచి బంగళా వుంది. రెండ్రోజులు మాగెస్టులుగా రావాలి, మీరంతా! చాలా బావుంటుంది!" అర్థించాడు.

రామకృష్ణ, వెంకోజీ, శర్మలకి పట్టరాని సంతోషం కలిగింది.

"తప్పకుండా వస్తాం సార్! వద్దని మిమ్మల్ని బాధ పెట్టడం, మావాడు భాస్కర్ని బాధపెట్టినట్టవుతుంది!" వెంకోజీ అన్నాడు. మిగతా ఇద్దరూ 'కరెక్ట్' అన్నారు. భాస్కర్ ముగ్గుర్నీ కొరకొరా చూశాడు.

"మరింకేం సార్! మీరు డేట్ చెబితే..." సుబ్బారావు వినయంగా అడిగాడు.

"మీకెప్పుడు వీలవుతుంది" భాస్కర్ అడిగాడు.




"నన్నొదిలెయ్యండి సార్! పక్షిలా ఎప్పుడూ దేశాల మీద తిరగడమే నా పని. మా పెద్దబ్బాయి ఎప్పుడూ ఎస్టేట్‌లోనే పక్షుల్నీ, జంతువుల్నీ పెంచుతూంటాడు. వాడు మీకు అన్ని ఏర్పాట్లూ చేస్తాడు."

"నాకు టైం దొరకదు!" భాస్కర్ నసిగాడు.

"అయితే ఓ పని చేద్దాం సుబ్బారావుగారూ! వచ్చే శనివారం కాక, ఆపైన శనివారం రాత్రికి, మేమంతా మీ ఎస్టేటుకి వస్తాం. ఆదివారం రాత్రి భోజనా లయ్యాక తిరుగు ప్రయాణం!...ఓకే!..." రామకృష్ణ అన్నాడు.

"విత్ ప్లెషర్ సార్!" సుబ్బారావు అన్నాడు. "సరిగా సాయంత్రం అయిదుగంటలకి, ఇదే ప్లిమత్ కమీషనర్ గారింటికి వస్తుంది. అక్కడనుంచి మిమ్మల్నందరినీ పికప్ చేసుకుని, ఎస్టేటుకి రావచ్చు!" అంటూ అందరితో కరచాలనంచేసి వీడ్కోలిచ్చాడు సుబ్బారావు.

కమీషనర్‌గారి కారు సాగింది.

** ** ** **

అనుకున్న ప్రకారం శనివారం సాయంత్రం త్వరగా భాస్కరింటికి చేరారు. రామకృష్ణ, వెంకోజీ, శర్మలు.

కరెక్టుగా అయిదింటికి ప్లిమత్ వచ్చి ఆగింది.

ఆ పనులు ఈ పనులు చేసుకుని, ఆరింటికి కుడి కాలు బయట మెట్టుమీద పెట్టాడు భాస్కర్.

కారు శివార్లు దాటి, గ్రేప్ గార్డెన్సు పక్కగా జోరుగా సాగిపోతోంది. ఆహ్లాదకరమైన వాతావరణం.

ప్రతి ద్రాక్ష తోటకి ఒక దిష్టిబొమ్మ పెట్టబడి వుంది. స్పీడుగా వెళుతున్న కార్లోంచి చూస్తుంటే, రోడ్డు పొడుగునా పోలీసులు నిలబడ్డట్టు దిష్టి బొమ్మలు కనిపించాయి. అది వూహించి, భాస్కర్ చిన్నగా నవ్వుకున్నాడు.

"రోడ్డు పొడవునా దిష్టిబొమ్మలే వున్నాయంటే, ఈ ఏడు ద్రాక్ష బాగా పండిందన్నమాట!" శర్మ అన్నాడు.

"బాగా పైరు దిగిందండీ!" డ్రైవరు జవాబు.

"ఈ దిష్టిబొమ్మలేవి ట్రా-వెధవసూపర్‌స్టైషన్లు!" భాస్కరన్నాడు. "కొత్త బిల్డింగ్ కట్టినా ఇంతే! రంగు లేసిన బూడిద గుమ్మడి కాయలో, నాలుక చాపిన రాక్షసి బొమ్మలో తగిలిస్తారు!"

"నువ్వేమీ అనుకోనంటే, దానికో చిన్న లాజిక్కు చెబుతా!" రామకృష్ణ అన్నాడు.

"ఏమిటది?"

"మనమెళుతున్న దారిలో కొందరందమైన ఆడ పిల్లలు కనిపించారనుకో! మనందరి మనసులు వాళ్ళ మీదకి మళ్ళుతాయి. కావాలన్న కోరిక పుడుతుంది! అంటే, మన మనస్సులు వెదుదార్లు పడతాయన్నమాట! కానీ అక్కడే ఒక తాటకిలాంటి వికృతపు ఆకారం మనల్నే చూస్తూ నిలబడితే మన దృష్టి ఆ వైపుకు పోనేపోదు! కాబట్టి, మన మనస్సు వెదుదారి పట్టదు! అందువల్ల ఈ దిష్టి బొమ్మలు, మనసుల్ని వెదుదార్లు పట్టకుండా కాపాడే రక్షక భటులని నా వుద్దేశం!" రామకృష్ణ అన్నాడు.

"శభాష్! చాలా బాగా చెప్పావు!" శర్మ, వెంకోజీలు మెచ్చుకున్నారు.

"సమర్థించండి - సమర్థించండి! ఏవో మాటలు చెప్పి!" భాస్కర్ అన్నాడు.

కారు ఎస్టేటులోకి ప్రవేశించింది. సుబ్బారావుగారి పెద్దబ్బాయి రాజేష్ సాదరంగా ఆహ్వానించాడు. చక్కగా అలంకరించబడిన ఎ. సి. హాల్లో డ్రింక్సు, జీడిపప్పు ఏర్పాటు చేశాడు.

అంతా కబుర్లు చెప్పుకుంటూ, వీడియోలో యేదో ఇంగ్లీషు మూవీ చూస్తూ, డ్రింక్సు సేవించారు. కాస్త మోతాదు మించిందేమో, త్వరగా నిద్రకు లొంగిపోయారు.

* * *

రాజేష్ పాతిక వేలు రొక్కం భాస్కరుకిచ్చి, దీనిని మా డాడీకివ్వండి! సాయంత్రం బొంబాయి వెళ్ళే ముందు మీ యింటికొస్తారు. ఆయనకింత దూరం వచ్చే టైముండదు!" అన్నాడు.

"అలాగే!" బ్రీఫ్‌ని తీసుకొని, కారులో పెట్టుకున్నాడు. అంతా యెక్కగానే ఫ్లిమత్ సాగింది.

మిత్రులంతా రాజేష్ మంచితనాన్ని, మర్యాదలని మెచ్చుకుంటున్నారు. ఈ చక్కటి అవకాశానికి కారణం మన భాస్కర్ మంచితనం, తెలివితేటలన్నారు. ఆ మాటలకు అతని మనసు కాస్త గర్వపడ్డది.

అంతలో కారు స్లో అయ్యింది. యేమిటా అని నిశితంగా చూస్తే, ద్రాక్షచేలలోని దిష్టిబొమ్మలన్నీ, వరుసగా, వక్కొక్కటే రోడ్డుమీదికి వస్తున్నాయి. క్షణం నివ్వెరపోయాడు. కారుదిగి, ఇటూ, అటూ చూచాడు. ఇంకేముంది! కొంప మునుకుపోతుంది. అమెరికన్ 'రాబోట్'లా [illegible]

## నీటివలె

నీటివలె ఏనాటికి
పొర్లాడుతూ పొంగుతూ
నీటివలె పోటీపడుతూ
రాయి రాయి మీద రాసుకుంటూ
నీటివలె ప్రపంచాన్ని శుభ్రపరుస్తూ
లోయలను సస్యశ్యామలపరుస్తూ
నీటివలె పారుతూ
చేలకు బలం చేకూరుస్తూ
నీటివలె మెరుస్తూ
కొత్త మంచుబిందువు వలె...
నీటివలె బ్రతకాలని కోరిక
వీలయితే ఒక్కనాటికయినా...

(ఏయోనగియాస్ రష్యన్ కవితకు అనువాదం)

...బి.వి.రమణ

వైపే వస్తున్నాయి! 'ఓగాడ్! యేమిటిది? బందిపోటు దొంగలు కనుక, ఆ వేషంలో రావడం లేదు కదా! పైగా, తనవద్ద పాతిక వేలు డబ్బుంది! 'కంగారుపడి వెనక్కు వచ్చాడు. అప్పటికే డ్రైవరు, ముగ్గురు మిత్రులు కారుదిగి, మెల్లగా జారుకోబోతున్నారు.

అంతలో, దిష్టిబొమ్మలు కొన్ని, రాకెట్లలా గాలిలో యెగిరి, రాబొట్‌లా తనమీదికి విజృంభించాయి! మిగతావి పరుగు పరుగున వచ్చి చుట్టుముట్టాయి. 'తనేం చెయ్యాలి? రివాల్వరు కూడా లేదు! ఏమైనా సరే! తనను తాను కాపాడుకోవాలి!' తెగించి తిరగబడ్డాడు.

చేతులతో గుద్దుతున్నాడు. కాళ్ళతో తంతున్నాడు. ఆ గడ్డి బొమ్మలు లెక్కచెయ్యడంలేదు. ఇంకా వేగంగా మీదికొస్తున్నాయి. క్రరచేతులని తనకు గురిపెట్టి, అన్నీ వక్కసారిగా అతనిని దొమ్మి చేయబోతున్నాయి! ఇక అయిపోయినట్లే! బిగ్గరగా అరిచాడు. "హెల్ప్! హెల్ప్!... శర్మా! నన్ను కాపాడండి!...శర్మా! శర్మా! ...హెల్ప్!... హెల్ప్..."

గుండెలు పగిలేలా అరిచినా, యెవ్వరూ తనకు సాయంరాకపోగా, దిష్టిబొమ్మలు తమ క్రరచేతుల్ని సూటిగా, తన కళ్ళకు గురిచూసి ముందుకొస్తున్నాయి!

"హెల్ప్!... హెల్ప్!... ఫైర్‌దెమ్!" మళ్ళీ అరిచాడు, పాపం భాస్కర్!

(పైవారం)

వేలాది కుటుంబాలు అనాదిగా వాడి చూడబడిన
**లవంగనూనె**
సద్గుణాలనిప్పుడు
**ప్రామిస్**
వాడి పొందగలుగుతున్నారు. మీరూ ఎందుకు వాడరాదు!




**ప్రామిస్**
- దంతక్షయం నుండి రక్షణకు తోడ్పడుతుంది.
- నోటిని తాజాగా రూపొందిస్తుంది.
- దుర్వాసనను అరికడుతుంది.

అంతర్జాతీయ స్వర్ణపతక విజేతలు

అరోగ్యంచిందే పళ్ళు, చిగుళ్ళు, తాజాశ్వాస.

బల్సారా ఉత్పాదన

CHAITRA-...-... TEL